

# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 07 జూన్ 2026 — పేజీలు : 04


# వెనిజులా వైస్ ప్రెసిడెంట్ డెల్సీ రోడ్రిగ్జ్‌కు ఘన స్వాగతం

### ధర్మవరం పట్టు చీరను బహూకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



వెనిజులా తాత్కాలిక ప్రధాని డెల్సీ రోడ్రీగ్స్ కు పట్టుచీర బాహుకరిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , చిత్రంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్

**శ్రీసత్యసాయి జిల్లా, జూన్ 06, ప్రభాతవార్త**

ప్రతినిధి వెనిజులా దేశ వైస్ ప్రెసిడెంట్, తాత్కాలిక ప్రధాని డెల్సీ రోడ్రిగ్జ్ శనివారం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి శ్రీ సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా పరిపాలనా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పి అంకిత, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మెనెజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఇతర ఉన్నతాధికారులు వెనిజులా వైస్ ప్రెసిడెంట్‌కు పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆమెను పుష్పగుచ్చులు, శాలువతో సన్మానించి సత్కరించారు. సత్య సాయి బాబా చిత్రపటంతోపాటు ధర్మవరం పట్టుచీరను ప్రత్యేకంగా బహూకరించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కుమారుడు వియన్, కుమార్తె వన్స్ లు వెనిజుల తాత్కాలిక ప్రధానిని కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ పట్ల అప్రమత్తంగా ఉండండి

### టిడిపి క్యాడర్‌కు ఎమ్మెల్యే కాలవ సూచన.



**రాయదుర్గం జూన్ 06 ప్రభాతవార్త**

ఓటర్ల సవరణ జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తప్పక ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి ఓటర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం ఏమరుపాటు పనికిరాదని హెచ్చరించారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ యూనిట్ ఇన్చార్జులు, క్లస్టర్ ఇంచార్జిలు, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా "ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2026" కార్యక్రమంపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ, ఈనెల 15వ తేదీ నుండి జూలై 14 వ తేదీ వరకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్లను సవరణ జాబితాలో (హౌస్ మ్యాపింగ్) పొందుపరుస్తారని వివరించారు. సర్వే అధికారులు ఇంటింటికి వెళ్లినప్పుడు స్థానిక బూత్ లెవెల్ ఏజెంట్లు, యూనిట్ఇన్చార్జిలు వారితో కలిసి వెళ్లాలన్నారు. ఆయా ఇండ్లలో అర్హులైన ఓటర్ల వివరాలను వారికి అందజేసేలా చూడాలన్నారు. ఇందులో ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా... ప్రత్యర్థి పార్టీలు మన ఓట్లను గల్లంతచేసి కుట్రలకు పాల్పడే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. ముఖ్యంగా కూటమి పార్టీలకు చెందిన, పార్టీ మద్దతుదార్ల, తటస్థదార్ల ఓటర్లను సవరణ జాబితాలో తప్పించకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పుడు నిద్రపోతే ఎన్నికల్లో నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. ఈలోగా ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండేలా బాధ్యతగా పని చేయాలన్నారు. 18 సంవత్సరాలు పైపడ్డ వారందరి పేర్లను ఓటరు జాబితాలో తప్పక చేర్పించాల్సి ఉందన్నారు. అలాగే చనిపోయిన, పెళ్లిళ్ల చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిన, లేదా శాశ్వత వలసదారులను గుర్తించి వారి పేర్లను జాబితా నుండి తొలగించేలా చూడాలన్నారు. వైసిపి పార్టీ వారు రెండు, మూడు చోట్ల తమ పేరు నమోదు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉందన్నారు. ఎక్కడైనా అలా ఉంటే..! వెంటనే గుర్తించి సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లి ఓటర్ల జాబితా నుండి తొలగింప చేయాలన్నారు. రాబోయే నెల రోజులు మనకు పరీక్ష సమయమని, ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు కురుబ హనుమంతు, కాలవ సన్నన్న, వన్నారెడ్డి, కురుబ మల్లెన్న,క్లస్టర్ ఇంఛార్జీలు తలారి గంగాధర్, గోవింద్, హరిజన ఆనంద్, మారుతీ, పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, వాల్మీకి సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.









# నిఘా నీడలో పారిశుద్ధ్య నిర్వాహణ

- 225 సిసి కెమెరాలకు నగరం అనుసంధానం - ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ
- సచివాలయాల్లో డిజిటల్ మ్యాపుల ఏర్పాటు
- ప్రజల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెం 1800 5992 401
- ట్రైల్ రన్ ప్రారంభించిన కమిషనర్ జశ్వంత్‌రావు



కమాండ్ కంట్రోల్ రూమ్ లో టోల్ ఫ్రీ పోస్టర్లను ప్రదర్శించి, సీసీ కెమెరాలు పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు



**అనంతపురం, జూన్ 6, ప్రభాతవార్త**

నగరంలో పారిశుద్ధ్య పనులు, వాహనాల నిర్వహణ జీపీఎస్ ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంచి, ఫిర్యాదుల కోసం సచివాలయాల్లో ప్రత్యేక డిజిటల్ మ్యాపులను ఏర్పాటుచేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జశ వ్వంత్‌రావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కార్యాలయంలో ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ట్రైల్‌రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ, పోలీస్ సమన్వయంతో దాదాపు 225 సిసి కెమెరాల ద్వారా నిరంతరం నిఘ ఉంటుందన్నారు. ఈ మేరకు వాహనాలు ఇంటింటి చెత్త సేకరణ,చెత్త తరలింపు, కార్మికుల పనితీరును పరిశీలించవచ్చన్నారు. నగరంలోని 74 సచివాలయాల్లో డిజిటల్ మ్యాపులు ప్రదర్శించబడిందని, అలాగే ప్రజలు ఫిర్యాదు చేయడానికి సంబంధిత శానిటరీ సెక్రటరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేసేలా వెసలుబాటు కల్పించామన్నారు. స్పందించని యెడల కమాండ్ కంట్రోల్ రూంలో ప్రత్యేకంగా ప్రతి రోజూ షిఫ్టుల వారీగా సిబ్బంది ఉదయం 6 నుండి సాయంత్రం వరకు పనిచేస్తారని వెల్లడించారు. ప్రజల ఫిర్యాదులు సంబంధిత సచివాలయ పర్యవేక్షకులు స్పందించకుంటే టోల్ ఫ్రీ నెం 1800 5992 401కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీని ద్వారా సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు దోపద పడతాదని వెల్లడించారు. అదే విధంగా ఈ నిఘాలో ప్రధాన ప్రాంతాల్లో ఉన్న షాపులు, హోటల్లు ఇతరత్రా వ్యాపారస్తులు చెత్తను రోడ్లపైన, కాలువలలో వేస్తే వారిని గుర్తించి 1,2 సార్లు హెచ్చరికలు జారీ చేసి తరువాత అపరాధ రుసుమును విధిస్తామన్నారు. అలాగే సచివాలయాలతో పాటు ఒక సచివాలయం పరిధిలో ప్రధాన కూడళ్ళలో ఈ మ్యాపింగ్ ఏర్పాటు చేయబడుతుందని, త్వరలో ఇంటింటికి ఈ టోల్‌ఫ్రీ నెంబరుతో కూడిన కరపత్రాలను అందజేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. వారం రోజులపాటు ట్రైల్‌రన్ నిర్వహిస్తున్నామని అనంతరం అధికారికంగా అమలుకు శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు షాకీర్ హుస్సేన్, టౌన్ ప్లానింగ్ అధికారి ఓంకార్‌రెడ్డి, అమినిటీ సెక్రటరీలు నవీన్‌కుమార్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

# నేను రౌడీనే

- ఉన్నది ఉన్నట్లు మాట్లాడే వారిని రౌడీ అంటారు
- గత ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు
- ప్రజాస్వామ్యాన్ని పోలీసులు ఖూనీ చేశారు
- మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, జూన్ 6 ప్రభాతవార్త**

నేను రౌడీనే, ఉన్నది ఉన్నట్లు మాట్లాడే వారిని రౌడీ అంటారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని అప్పటి అధికారుల వ్యవహార శైలిపై జె.సి ప్రభాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామంలో టిడిపి నాయకులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో తమను స్వేచ్ఛగా ఎన్నికల్లో పోటీ చేయనీయలేదని, అడుగడుగునా అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. అప్పట్లో ప్రజాస్వామ్యం లేదని, టిడిపి నాయకులను పోలీసులు తీవ్రంగా వేధించారని జె.సి మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పైస్థాయి ఆదేశాలతో కొంతమంది పోలీసు అధికారులు బలవంతంగా రిగ్గింగ్ చేయించారని ఆరోపించారు. అప్పటి డిఎస్‌పిలు, సిఐలు కొన్ని చోట్ల ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారని, మరికొన్ని స్థానాల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయించారని విమర్శించారు. అంతేకాకుండా ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పట్లో వ్యవహరించిన అధికారులే తమకు సహకరించి ఏకగ్రీవాలు చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వంలో టిడిపి నాయకుల స్వేచ్ఛను హరించారని ప్రస్తుతం వారు చేసిన పనిని తాము చేసి చూపిస్తామని తెలియజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నారని అన్ని స్థానాల్లో టిడిపికి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలుపొందారని అందరూ కలిసి వచ్చే ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో ఏకగ్రీవాలు జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఎక్కువగా నష్టపోయింది తమ కుటుంబమేనని అందరూ గమనించాలని ఆయన తెలియజేశారు.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ 2026 చేపడతాం

- ఎస్ఐఆర్ 2026పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి అవగాహన ఉండాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్

**అనంతపురం కలెక్టరేట్ జూన్ 06 ప్రభాతవార్త**

జిల్లాలో ఎస్ఐఆర్ 2026 కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ 2026పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2002లో ఉన్న ఓటర్లు మరియు 2025 లో ఉన్న ఓటర్లు మరియు వారి పిల్లలకు సంబంధించిన మ్యాపింగ్ 68 శాతం పూర్తయిందని తెలిపారు. మ్యాపింగ్ 90 శాతంకి తక్కువ కాకుండా పూర్తి అయ్యేలా అందులో భాగంగా బిఎల్ఓలు7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని వివరించారు. ఫోటో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణను చేపట్టేందుకు షెడ్యూల్ మరియు వివరణాత్మక సూచనలను భారత ఎన్నికల సంఘం జారీ చేసిందని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యాచరణలో భాగంగా శనివారం నుండి 14వ వరకు తయారీ, శిక్షణ , ప్రింటింగ్, 15వ నుండి 14వ వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు చేసి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు ఇవ్వడం జరుగుతుంది మరియు అందులో ఒక పూరించిన ఎన్యుమరేషన్ ఫారం తిరిగి తీసుకోవడం జరుగుతుందన్నారు. జూలై 14 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జూలై 21 న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, 21.07.2026 నుండి 20.08.2026 వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాలపరిమితి, 21.07.2026 నుండి 18.09.2026 వరకు నోటీసు దశ/క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం, 22.09.2026న తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు మరియు మార్గదర్శకాల ఆధారంగా చేర్పులు ,సవరణలకు లోబడి ఎస్ ఐ ఆర్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీలోపు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్యాముల్, బిజెపి ప్రతినిధి ఈశ్వర్ ప్రసాద్, బీఎస్పీ ప్రతినిధి అంజయ్య, టిడిపి ప్రతినిధి నారాయణస్వామి, వైఎస్ఆర్సిపి ప్రతినిధి అమర్నాథ్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్ వలి, సిపిఐ .ఎం, బాలరంగయ్య, కాంగ్రెస్ ప్రతినిధి బషీర్, జనసేన పార్టీ ప్రతినిధి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# పరిటాల కుటుంబంపై సభ్యతా సంస్కారం లేని మాటలు మాట్లాడడం మానుకో ప్రకాష్ రెడ్డి

### - టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ హెచ్చరిక



మాట్లాడుతున్న బండి పరశురామ్

**అనంతపురం న్యూటౌన్, జూన్ 6 ప్రభాతవార్త**

పరిటాల కుటుంబంపై సభ్యతా సంస్కారం లేని మాటలు మాట్లాడడం మనుకోవాలని ప్రకాష్ రెడ్డిని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరుశురామ్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నీ కాళ్ళు నీవు మొక్కుకొని నీవు నిజాయితీ పరుడు అంటే సరిపోదు నియోజకవర్గం ప్రజలు అనాలి, 2019 నుంచి 2024 వరకు బంది పోట్లు పాలన చేశారు అని నియోజకవర్గం ప్రజలు నిన్ను ఓడించారు ప్రకాష్ రెడ్డి, నీవు నీ కుటుంబ సభ్యులు అవినీతి రాక్షసులు రాప్తాడు నియోజకవర్గంలో దోపిడి చేశారు మాఫియా పాలన సాగించారు ప్రకాష్ రెడ్డి, అమ్మ డైరీ పేరుతో డ్వాక్రా మహిళలతో 10 కోట్ల రూపాయలు వసూలు చేసి 4 సంవత్సరాలు రియల్ ఎస్టేట్ దందాలు చేసి వందల కోట్ల రూపాయలు సంపాదించుకొని అమ్మ డైరీ కట్టి మీ అమ్మ ను డెయిరీ చైర్మన్‌గా నియమించడం నిజం కాదా ప్రకాష్ రెడ్డి అన్నారు. జగనన్న ఇల్లు పేరుతో వందల కోట్ల రూపాయలు ముందస్తు బిల్లులు చేసుకొని కనీసం ఏ ఒక్కరికి కూడా ఇల్లు పూర్తి చేయకుండా పేదలను మోసం చేసింది వాస్తవం కాదా ప్రకాష్ రెడ్డి అన్నారు. పేరూరు డ్యాం పనులు ప్రారంభం చేయకుండా రైతులను మోసం చేసింది వాస్తవం కాదా ప్రకాష్ రెడ్డి అన్నారు. వైసీపీ పార్టీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాప్తాడు నియోజకవర్గంలో ఇసుక, ఎర్రమట్టి మాఫియా వెంచర్ వేసిన వాళ్ళతో ఎకరాకు 10 లక్షలు అక్రమంగా వసూళ్ల చేసింది వాస్తవం కాదా ప్రకాష్ రెడ్డి నీవు నీ సోదరులు చేసిన దుర్మార్గాలు ఇప్పటికి రాప్తాడు ప్రజలు మరువలేదు అని గుర్తు చేశారు. నీ సొంత పార్టీ కార్యకర్తలను కూడా వదలకుండా కోట్ల రూపాయలు అప్పులుగా తీసుకోని తిరిగి డబ్బులు అడిగితే దౌర్జన్యం చేసింది వాస్తవం కాదా ఇంత కంటే దుర్మార్గం ఏదన్నా ఉంటుందా ప్రకాష్ రెడ్డి అన్నారు. తోపుదుర్తి గ్రామంలో గ్రామ ప్రజలు చందాలు వేసుకొని ఊరు దేవర జరుపుకోనీ చందాలు వేసుకున్న డబ్బులు 14 లక్షలు మిగిలితే ఆ డబ్బులు కూడా మీ అన్న తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ చందు తీసుకున్నది వాస్తవం కాదా ప్రకాష్ రెడ్డి రాప్తాడు మండలం లో ఉన్న జాకి పరిశ్రమను డబ్బులు కోసం వారిని బెదిరించి జాకి పరిశ్రమను వెళ్లగొట్టింది నిజం కాదా నియోజకవర్గంలో అన్న దమ్ములు మధ్య భూ తగాదాలు పెట్టి అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకొని ఇదేమి అన్యాయం అని అడిగితే నా పై అక్రమంగా కేసులు పెట్టించి రౌడీ షీట్ ఓపెన్ చేపించి జైల్లో పెట్టింది నిజం కాదా ప్రకాష్ రెడ్డి, 2024 లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రెండు సంవత్సరాలనుండి రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామంలోకూడా దాదాపు 125 కోట్ల రూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్డు వేపించారు నీ కళ్ళు ఏమన్నా మూసపోయాయో ఒక్కసారి నియోజకవర్గం అంతా తిరిగి కళ్ళు పెట్టి చూడు ప్రకాష్ రెడ్డి పేరూరు డ్యాం అభివృద్ధి కోసం 805 కోట్ల రూపాయలు బడ్జెట్ ను నీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని మూడు ముక్కలు చేస్తే టీడీపీ అధికారం వచ్చిన వెంటనే తిరిగి పేరూరు డ్యాం కు సాగునీరు తీసుకెళ్లాలి అని పనులు పునః ప్రారంభం చేసింది వాస్తవం కాదా ప్రకాష్ రెడ్డి, పరిటాల సునీతమ్మ చేస్తున్న అభివృద్ధి చూసి నియోజకవర్గం ప్రజలు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మ రథం పడుతుంటే అది చూసి ఓర్వలేక ఒక మహిళ అని కూడా చూడకుండా నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నావు ప్రకాష్ రెడ్డి నియోజకవర్గం ప్రజలే నిన్ను పరకలతో బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో ఉంది అది గుర్తు పెట్టుకో ప్రకాష్ రెడ్డి, పరిటాల కుటుంబం పై కారు కూతలు తప్పుడు ఆరోపణలు చేస్తే నీ నాలుక చిలేస్తాం ఖబర్దార్ ప్రకాష్ రెడ్డి, అభివృద్ధి అంటే ఏంటో తెలియని నీలాంటి దద్దమ్మలు కూడా పరిటాల కుటుంబం పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు ప్రకాష్ రెడ్డి నీ బ్రతుకు నియోజకవర్గం ప్రజలకు తెలిసే నిన్ను పరిటాల సునీతమ్మ చేతిలో మూడు సార్లు ఓడించారు ఇంకా నీకు బుద్ధి రాలేదు అంటే నీలో సిగ్గు శర్మ చీము రక్తం ఎక్కడ ఉందో తెలియాలి ప్రకాష్ రెడ్డి, రాప్తాడులో బందిపోట్లు పాలనను విముక్తి చేసి రెండు సంవత్సరాలు అయినా ఖాబ్జాలతో మొదలు అయిన నీ పాలనను ప్రజలే నిన్ను కాలగర్భంలో కలిపారు ప్రకాష్ రెడ్డి, నీ జీవితం అంతా అవినీతి అక్రమాలు... దందాలు దౌర్జన్యాలు... కుట్రలు కుతంత్రాలే ప్రకాష్ రెడ్డి ప్రకాష్ రెడ్డి రాప్తాడు నియోజకవర్గంలో శ్యాశ్వతంగా వైసీపీ జండాను ఎగరనివ్వం నీ డైరీలో రాసి పెట్టుకో రాప్తాడు నియోజకవర్గం ప్రజల భవిష్యత్ పరిటాల కుటుంబ భాధ్యత కాబట్టే నియోజకవర్గంలో ఉన్న ప్రతి చెరువుకు సాగునీరు త్రాగునీరు అందిస్తూ ప్రజల సంక్షేమం కోరుకుంటున్నారు ఇలాంటి కుటుంబం పై నీవు ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసిన ప్రజలు నిన్ను నీ మాటలను నమ్మే పరిస్థితి లేదు ప్రకాష్ రెడ్డి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలి

### - యువ క్రికెటర్లకు సూచించిన మాంఛో ఫెర్రర్



క్రీడాకారులక సూచనలు అందిస్తున్న మాంఛో ఫెర్రర్

**అనంతపురం సిటీ, జూన్ 6 ప్రభాతవార్త**

అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి క్రీడా కారులు భారత జట్టులు స్థానం సంపాదించేలా కృషి చేయాలని ఆర్డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ సూచించారు. ఆర్డిటి క్రీడా మైదానంలో నిర్వహించిన బిసిసిఐ, సిఓఈ అండర్-16 కోచింగ్ క్యాంప్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆర్డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ.. బిసిసిఐ, ఏసిఏ సంయుక్త ఆధ్వర్యంలో మే 11 నుంచి నిర్వహించిన క్యాంపుకు దేశంలోని అనేక ప్రాంతాల నుంచి ప్రీమియర్ క్రీడాకారులు పాల్గొనడం శుభ పరిణామం అన్నారు. ఈ శిభిరం నుంచి భావి భారత క్రికెట్ జట్టు ఆటగాళ్లు ఎదగాలని ఎదురు చూస్తున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా కారులు తమ కెరిర్ అభివృద్ధికి ప్రయోజన కరంగా ఈ శిక్షణను, అనుభవాలను పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని ఆశిస్తున్నామన్నారు. ఇలాంటి క్యాంపును ఆర్డిటి క్రీడా మైదానంలో నిర్వహించేందుకు అవకాశం కల్పించిన బిసిసిఐ, ఏసిఏ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాన కోచ్ హేం జోషిపుర మాట్లాడుతూ.. ఆర్డిటి క్రీడా మైదానంలో అద్భుత సౌకర్యాలు ఉన్నాయని క్రీడా కారులకు సౌకర్యాలు ఎంతో దోహద పడ్డాయని పేర్కొన్నారు. నాలుగు వారాల పాటు నిర్వహించిన శిక్షణ శిభిరం సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఆర్డిటి అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పాస్ట్ బౌలింగ్ కోచ్ పర్వీందర్ ఆవాన, స్పిన్ బౌలింగ్ కోచ్ అప్పారావు, ఫీల్డింగ్ కోచ్ రొనాల్డ్‌రాయ్, ఫిజియోథెరఫీలు మగన్‌సింగ్ చౌహాన్ కీగన్ మినెజస్, కోచ్‌లు వైభవ్ గోస్వార్మి, ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, ఆర్డిటి ఆపరేషన్స్ మేనేజర్ జ్యోతికుమార్, క్యూరేటర్ మధు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

02ATP06.qxd:02ATP06.qxd 07/06/26 11:09 PM Page 1



## ఎస్ఐఆర్ లో బిఎల్ఏ ల పాత్ర కీలకం

- టిడిపి ఎలక్షన్ చీఫ్ ఏజెంట్ అనిల్ కుమార్




ప్రసంగిస్తున్న చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ అనిల్



హాజరైన టిడిపి బిఎల్ఏ లు, నాయకులు

**హిందూపురం జూన్ 6 ప్రభాతవార్త**

ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా నిర్వహించే ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర కీలకమని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్, మున్సిపల్ మాజీ చైర్మన్ జేవీఎస్ అనిల్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక జేవీఎస్ కళ్యాణ మండపంలో జరిగిన టిడిపి నియోజకవర్గస్థాయి బూత్ లెవెల్ ఏజెంట్లు, క్లస్టర్, యూనిట్, కన్వీనర్ల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర బాలాజీ నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వర్ యాదవ్ హాజరయ్యారు. ఇటీవల సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఎస్ఐఆర్ వర్క్ షాప్ లో 175 నియోజకవర్గాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యే లు, ఎంపీలు హాజరుకాగా హిందూపురం నుంచి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈ క్రమంలో హిందూపురంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ లో మరణించిన వారి పేర్లు తొలగించడం, ఒకే వ్యక్తి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరుగా ఉంటే తొలగించడం, చిరునామా మార్చిన వారి వివరాలు సరిచేయడం, కొత్త అర్హులైన ఓటర్లను చేర్చడం, జాబితాను ఖచ్చితంగా ఉంచడం మొదలైనవి ప్రధాన లక్ష్యం అని వివరించారు.

## చిన్నారి జీవితానికి...ఆ వెయ్యి రోజులే కీలకం

-ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించడమే లక్ష్యం

-అంగన్‌వాడి కార్యకర్తల శిక్షణలో పాల్గొన్న సిడిపిఓ డాక్టర్ శాంతలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ

**గోరంట్ల, జూన్ 6 ప్రభాతవార్త**

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నవచేతన యాప్ పైన అంగన్‌వాడి కార్యకర్తలకు రెండవ రోజు శనివారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ డాక్టర్ శాంతలక్ష్మి హాజరయ్యారు. ట్రైనర్లుగా విజయ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగరాణి, మంజుల పాల్గొన్నారు. సిడిపిఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి వెయ్యి రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైనవని సిడిపిఓ పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడు సంవత్సరాల వయసులోపు, 90 శాతం ఆరు సంవత్సరాల వయసులోపు పూర్తవుతుందని వివరించారు. ప్రారంభ సంవత్సరాల్లో అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత మరియు ప్రేరణ పిల్లల భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత మరియు శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో సేవలందించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖతో సమన్వయంగా "నవచేతన" అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ చేసే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం, 0–6 సంవత్సరాల వయసు గల పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి ఉపయోగ పడుతుందన్నారు. నవ చేతన వేదిక ద్వారా అంగన్‌వాడి కార్యకర్తలు పిల్లలలో స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞాన వికాసం మరియు సామాజిక భావోద్వేగ అభివృద్ధి వంటి ఐదు ప్రధాన అభివృద్ధి రంగాలను వ్యవస్థీకృతంగా పరిశీలించగలరని తెలిపారు. దీని ద్వారా అదనపు మద్దతు లేదా ముందస్తు జోక్య సేవలు అవసరమయ్యే పిల్లలను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండాపురం, మండలపల్లి సెక్టార్ల అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం

## నూతన ట్రస్ట్ బోర్డు ఏర్పాటు

-రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగనున్న కమిటీ

- ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్



లేపాక్షి ఆలయం ముఖద్వారం

**లేపాక్షి, జూన్ 6 ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లేపాక్షి శ్రీవీరభద్రస్వామి ఆలయం నూతన ధర్మకర్తల మండలిని ప్రభుత్వం నియమించింది. ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి జిల్లా దేవాదాయ శాఖ అధికారి సమర్పించిన నివేదిక, అభ్యర్థుల పూర్వాపరాల పరిశీలన అనంతరం ఏపి దేవాదాయ చట్టం 1987, సెక్షన్ 15(2) ప్రకారం ఈ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ధర్మకర్తలుగా నియమితులైన వారు :

నూతన బోర్డు సభ్యులుగా మొత్తం 7 మంది నియమితులు కాగా, అర్చక విభాగం నుంచి ఒకరు ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా వ్యవహరిస్తారు. పరిగి వేణుగోపాల్‌రావు, నరసప్ప, వై.వి. త్రివేణి, మహేంద్రనాథ్, అంజినప్ప, బెంగళూరు లక్ష్మీదేవమ్మ, రవికుమార్ గారి పుష్పలత, శ్రీనివాసకుమార్, (మహిళా, జనరల్ కేటగిరీలు) ప్రస్తుతానికి మరో రెండు ఖాళీగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

30 రోజుల్లోగా ప్రమాణ స్వీకారం తప్పనిసరి :

ధర్మకర్తలుగా నియమితులైన వారు పదవీ ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. నిబంధనల ప్రకారం ఉత్తర్వులు అందిన 30 రోజుల్లోగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్ణీత సమయంలోగా ప్రమాణ స్వీకారం చేయని పక్షంలో వారి సభ్యత్వం రద్దవుతుందని దేవాదాయ శాఖ స్పష్టం చేసింది. నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, ఆపై బోర్డు చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని స్థానిక దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ను కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన పూర్తి నివేదికను, అఫిడవిట్లను ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

## రాష్ట్ర మైనారిటీ సదస్సులో షేక్ భాష

**హిందూపురం టౌన్ జూన్ 6 ప్రభాతవార్త**



సజ్జలతో షేక్ బాషా

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మైనారిటీ వింగ్ సమావేశం శనివారం నిర్వహించారు. తాడేపల్లి వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హిందూపురం నుంచి ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాషా హాజరయ్యారు. మైనారిటీల సమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ అరాచకాలు, ప్రజావ్యతిరేక విధానాలపై బలమైన పోరాటం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీలు ఎండి. రుహుల్లా, ఇసాక్ బాషా, మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ హాఫీజ్ ఖాన్, పలువురు నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ మైనారిటీ నాయకులు కేవలం తమ వర్గానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలన్నారు. డీఎస్సీ 2025 అక్రమాలపై స్పందిస్తూ బాధిత అభ్యర్థులు వైయస్ జగన్‌ను కలిసి తమ సమస్యలు వివరించగా, దానిపై కూడా ప్రభుత్వం విమర్శలు చేయడం విచిత్రమన్నారు. సంబంధిత మంత్రి విదేశీ పర్యటనలో ఉండగా అధికారులు మాత్రం డీఎస్సీ అక్రమాలను సమర్థించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది ఉద్యోగాలను ఎలాంటి వివాదాలకు తావులేకుండా భర్తీ చేశామని, అయితే ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ నియామకాల్లో అనేక అనుమానాలకు తావిచ్చిందని అన్నారు. మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా నిలిచిందని, భవిష్యత్తులో కూడా అదే విధంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించిన సజ్జల, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఓటమి తప్పదనే భయంతో వైఎస్సార్‌సీపీ అనుకూల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. జూన్ 15 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వేపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి కార్యకర్త దీనిని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## నవ చేతన వినియోగంపై అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ తరగతులు



అంగన్వాడీ వర్కర్ లకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ నాగమల్లేశ్వరి

**మడకశిర టౌన్ జూన్ 6 ప్రభాతవార్త**

పుట్టినప్పటి రోజు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లల్లో అభివృద్ధి లోపాలను గుర్తించి తగిన చికిత్స అందించేందుకు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత యాప్ పరిజ్ఞానంతో వైద్య పరీక్షలు నిమిత్తం నవచేతన యాప్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని.పిల్లల్లో మైలురాళ్ల అభివృద్ధిని సరిగా గుర్తించడమే ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ సీడీపీఓ, నాగమల్లేశ్వరి,సూపర్వైజర్ శ్రీదేవిలు తెలిపారు. ఏఐ ఎనేబుల్డ్ ఈసిడి స్క్రీనింగ్ పై సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో మడకశిర మండల పరిధిలోని ఆమిదాల గొంది గ్రామంలో అంగన్వాడీ వర్కర్ లను రెండు రోజుల శిక్షణా తరగతులు జరిపారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగ మల్లేశ్వరి, సూపర్వైజర్ శ్రీదేవి లు మాట్లాడుతూ: పిల్లల ఎదుగుదలలో ప్రధానంగా ఐదు అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదల విషయంలో సంభవించే లోపాలపై వివరించమని తెలిపారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లల ఆరోగ్య స్థితిని ఖచ్చితంగా గుర్తిస్తే సాధ్యమైనంత తొందరగా మెరుగైన సేవలందించేందుకు వీలవుతుందన్న ఉద్దేశంతో ఐసీడీఎస్ శాఖ సరికొత్త కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. నవచేతన యాప్ లో పిల్లల్లో ఐదు రకాల అభివృద్ధులు సబంధించిన స్క్రీనింగ్ ద్వారా పిల్లల అభివృద్ధిలో మైలురాళ్ళలో జరిగే ఆలస్యాలను గుర్తించి అధిగమించవచ్చనన్నారు. పౌష్టికాహారంతో పాటు స్టిమ్యులేషన్ జరిగినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. నవచేతన యాప్ గురించి పిల్లల్ని ఎలా స్క్రీనింగ్ చేయాలో పిల్లల్లో జరిగే ఐదు అభివృద్ధులు గురించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు శ్రీదేవి. గీత. సంగీత. సవిత. అంగన్వాడి కార్యకర్తలు.తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా మండల యువజన అధ్యక్షుడిగా మల్లికార్జున

**అమరాపురం జూన్ 6 ప్రభాతవార్త**



మల్లికార్జున

అమరాపురం మండల వైకాపా యువజన విభాగం అధ్యక్షుడిగా అమరాపురం పట్టణానికి చెందిన మల్లికార్జున ను ఎంపిక చేసినట్లు వైకాపా పార్టీ కార్యాలయం నుండి ఆదేశాలు వచ్చాయి. ఈ సందర్భంగా మండల యువజన అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షురాలు మాజీ మంత్రివర్యులు ఉషశ్రీ చరణ్ , హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డప్ప గారి రమేష్ కుమార్ రెడ్డి, మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఎస్ఎల్ ఈరలక్కప్ప, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు హాలుకూరు కాంతరాజుల సహకారంతో మండల యువజన విభాగం అధ్యక్షుడుగా నియమించినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా అమరాపురం మండలంలోని మండల స్థాయి నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మండలంలో పార్టీ అభివృద్ధికి నా వంతు శాయశక్తుల కష్టపడి యువత సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నాకు అవకాశం కల్పించినటువంటి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

- పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల అందజేత

**కనగానపల్లి జూన్ 6 ప్రభాత వార్త**



పిల్లలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మండల కేంద్రం లోని గ్రంథాలయం నందు శనివారం వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ను మండల గ్రంథాలయ అధికారి కేజీ నాగమణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా యోగ ఆసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాజుల సోమేశ్వర్ రెడ్డి , డిప్యూటీ ఎంపీడీవో ఎస్. శ్రీనివాసులు, యోగ టీచర్ కోనాపురం సాయి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు చిన్నతనము నుండి గ్రంథాలయం కు వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి అని తెలిపారు మరియు వివిధరకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి జయచంద్ర ,యోగ మాస్టర్ సుబ్బారాయుడు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏపీ ఎయిమ్స్ విధానంలో యూరియా, డీఏపీ అమ్మకాలు

వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మణ నాయక్



ఎరువుల దుకాణదారులతో సమావ్నేశ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

**ధర్మవరం రూరల్ జూన్ 6 ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజన్ నుంచి యూరియా, డీఏపీ ఎరువుల అమ్మకాలను ఏపీ ఎయిమ్స్ విధానంలో నిర్వహించాలని ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మా నాయక్ సూచించారు. స్థానికంగా ఎరువుల దుకాణయజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులను గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్పీ)కే విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన నిల్వలు, భౌతిక నిల్వలకు మధ్య ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని ఆదేశించారు. ఎరువుల అమ్మకాలు జరిగిన వెంటనే డీబీటీ, ఏపీఎయిమ్స్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పురుగుమందులు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణ యజమానులకు స్పష్టం చేశారు. రైతులు కూడా విత్తనాలు, పురుగుమందులు, రసాయన ఎరువుల కొనుగోలుకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పంట సాగు చేసి, పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఏపీ ఎయిమ్స్ పోర్టల్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల విక్రయాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎరువుల విక్రేతలకు సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, ఎరువుల దుకాణ యజమానులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ




పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డిటి నర్సింగ్ విద్యార్థినీలు

**బత్తలపల్లి, జూన్ 6 ప్రభాతవార్**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్డిటీ నర్సింగ్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్డిటి ఆసుపత్రి నుండి బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలి వరకు ఆర్డిటి ఆస్పత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, మనభూమి సిబ్బందిచే భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా విరివిగా మొక్కలు నాటుదాం స్వచ్ఛమైన గాలి వర్షాలను ఆస్వాదిద్దాం,ఇంటి పరిసరాలలో చెట్లను నరకవద్దు ఇంటికి ఒక చెట్టు నాటండి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. ర్యాలీ దారి పొడవునా రహదారి పక్కన జాతీయ రహదారి డివైడర్ల మధ్య ఉన్న చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అంతకుమునుపు ఆర్డిటి ఆసుపత్రి ఆవరణంలో ఆర్డిటి నర్సింగ్ సూపరిండెంట్ లక్ష్మీ, ఆర్డిటి సోషల్ వర్కర్ లక్ష్మణ్,మనభూమి సిబ్బంది నరేష్, మోహన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల జరగబోతున్న అనర్థాలను వివరించారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో పర్యావరణం దెబ్బ తినడం వల్ల మానవ మనుగడకే తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డిటి ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## రూముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మాట్లాడుతున్న టీచర్ విశ్వర్

**బత్తలపల్లి, జూన్ 6 ప్రభాతవార్త**

బత్తలపల్లి గ్రంథాలయములో దాదాపు 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసింది.శనివారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఈశ్వర్ కోచింగ్ సెంటర్ లో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఈజీ రైటింగ్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శాఖ గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు.వేసవి శిక్షణ శిబిరంలో పుస్తకాలు చదవడం,పిల్లల మానసిక వికాసాన్ని పెంచడానికి గేమ్స్ క్యారమ్ బోర్డ్, మ్యూజికల్ చైర్స్ ఆడడం,క్విజ్ ద్వారా పిల్లలు మేధస్సును పెంచడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లలు లైబ్రరికి వచ్చి దినపత్రికలు చదవటం,పుస్తకాలు చదవటం నేర్చుకుంటారన్నారు. బత్తలపల్లిలోని ఈశ్వర్ కోచింగ్ సెంటర్ ద్వారా పిల్లలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థులు లైబ్రరీలో సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈశ్వర్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ విశ్వరూప, ఈశ్వరచంద్రప్రసాద్, దైవాధీనం,భాష, శ్రీ జ్యోతి హైస్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మినారాయణ, విద్యాధరి హైస్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిబిరం

**చెన్నేకొత్తపల్లి, జూన్ 06 ప్రభాతవార్త**



పొందిన బహుమతులను చూపుతున్న విద్యార్థులతోపాటు గ్రంతాలయ సిబ్బంది

మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి గ్రంథాలయంలో గత ఏప్రిల్ 28 నుండి జూన్ 06 వరకు నిర్వహించిన వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్) శనివారంతో విజయవంతంగా ముగించినట్లు గ్రంథా లయ అధికారి కె.జయరాం తెలియ జేశారు. ఈ సందర్భంగా శనివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ, మాజీ ఎంపీపీ అమరేంద్ర హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గత ఏప్రిల్ 28 నుండి జూన్ 06 వరకు సుదీర్ఘంగా జరిగిన ఈ వేసవి శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలను, నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, సమ్మర్ క్యాంప్ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

ఈ ముగింపు కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ పాఠకులు నానీ స్వామి, నారాయణ స్వామి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనంత డివిజన్ స్థాయి రైతు సేవ కేంద్ర సిబ్బందికి అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జెడిఎ సాలు రెడ్డి.

**అనంతపురం రూరల్, జూన్ 06 ప్రభాతవార్త**

స్థానిక కృషి భవన్‌లో రైతు సేవా కేంద్ర సిబ్బందికి డివిజన్ స్థాయి అవగాహన కార్యక్రమంను ఇంచార్జ్,సహాయవ్యవసాయ సంచాలకులు అనంతపురం ఏ వెంకటకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి సార్ హాజరై సీ.ఎం ఏ.ఐ.డీ వెబ్ లాగిన్ లో ప్రతి రైతు సేవ కేంద్ర సిబ్బంది వారి లాగిన్ నందు లాగిన్ అయి ఫార్మర్ డేటా బేస్ నందు రైతు వారిగా వెరిఫై చేసి రైతు వారిగా పంట నమోదు వివరాలు ఏమన్నా తప్పుగా ఉన్నచో ఎడిట్ చేసి రైతు వారి లిస్టురైతు సేవాకేంద్రంలో పొందుపర్చాలి.అప్పటికి కూడా రైతులు చెక్ చేసుకుని ఏమన్నా ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తమ రైతు సేవా కేంద్రసిబ్బందికి తెలియజేయాలని, అలాగే ఈ లిస్టులో రైతు వారిగా సాగుచేసిన పంటల వివరాముల ఆధారంగా యూరియా మరియు డిఏపి రైతులకు వారి రైతు సేవ కేంద్రం ద్వారా అప్లై చేసుకున్నచో వారికి ఫర్టిలైజర్ షాప్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు .అలాగే రైతులు రసాయనిక ఎరువుల వినియోగంతగ్గించిన్యాచురల్ ఫార్మింగ్ ఆర్గానిక్ ఫార్మింగ్ బయో ఫెర్టిలైజర్స్ బయో ఫెస్టిసైడ్స్ వంటివి వాడడం వల్ల భూమిలో హ్యూమస్ శాతంపెరిగిభూమినితిరిగి సారవంతమయ్యేటట్టుచేసుకోవచ్చని తెలియజేశారు. అలాగే కందిపంట 2025 సంవత్సరంలో సాగుచేసిన విస్తీర్ణంలో 25 ఈ సంవత్సరంలో అధికంగా కంది పంటను సాగు చేయవలెనని ప్రతి రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలియజేశారు అలాగే ఏ.పీ.ఎఫ్.ఆర్, సి సి ఆర్ సి కార్డ్స్ మరియు వేరుశనగ రిజిస్ట్రేషన్ మరియు ఫార్మర్ యాప్ వేగవంతం చేయాలని తెలియజేశారు. అలాగే సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ వెంకటకుమార్ మాట్లాడుతూ జూన్ 15వ తేదీలోపు ఏ.పీ.ఎఫ్.ఆర్, ఏ.పీ.ఐ. ఎం.ఎస్, సి.సి.ఆర్సి కార్డ్స్ ఫార్మర్ యాప్ డౌన్లోడ్ పూర్తి చేయాలని అలాగే పి ఎం డి ఎస్ మోడల్ మరియు కంది పంట లో ఇంటర్ క్రాఫ్పింగ్,మల్టిపుల్ క్రాఫ్పింగ్ గురించి తెలియజేశారు ఈ కార్యక్రమంలో అన్ని మండలాల వ్యవ సాయ అధికారులు సోమశేఖర్,శుభఖర్,శ్యామసుందర్ రెడ్డి విజయ్ జ్యోత్ కుమార్, కృష్ణ చైతన్య, టెక్నికల్ ఏవో వంశీకృష్ణ సాయి లక్ష్మి వ్యవసాయ విస్తరణ అధికారులు మురళీకృష్ణ,భాగ్యశ్రీ,రంజిత రాణి, సుజిత, అక్కమ్మ, రాము, శ్రీ వాణి, నగేష్ , హరిబాబు పవన్ కుమార్ అన్ని మండలాలలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ యాదవ్

**అనంతపురం రూరల్,జూన్ 06 ప్రభాతవార్త:**



శ్రీకాంత్ యాదవ్

అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ యాదవ్ ను జిల్లా ఎస్పీ అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయడంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండి వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వాటిని ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. అదేవిధంగా మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రయత్నిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంజరుగుతుందన్నారు.సిఐ గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

గరీబ్ కా దర్ద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## పేద కుటుంబాలకు వివాహ సామగ్రి పంపిణీ

**అనంతపురం కల్చరల్,జూన్ 06 ప్రభాతవార్త:**




వివాహసామగ్రి అందజేస్తున్న దృశ్యం

గరీబ్ కా దర్ద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇద్దరు నిరు పేద కుటుంబాలకు వివాహ అవసరాల కోసం రేషన్ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం ముఖ్య అతిథుల సమక్షం లో నిర్వహించ బడింది.ఈ కార్య క్రమంలో క్యాన్ పెట్రోల్ బంక్‌కు చెందిన ఎస్. నియాజ్ అహ్మద్, ఎం.జె. ఎస్.సి గౌరవ అధ్యక్షులు, అంగిడి ఈషాక్ భయ్యా, రియాజుద్దీన్, షేక్ అఫ్జల్ బాషా, ఖాదర్ బాషా మరియు రాణి నగర్‌కు చెందిన అల్తాఫ్ పాల్గొని తమ సహకారాన్ని అందించారు. అదేవిధంగా, చంద్రయాన్ ట్రస్ట్‌కు చెందిన చంద్ర వివాహ కార్యక్రమానికి అవసరమైన ప్లేట్లు, కప్పులు, స్పూన్లు తదితర సామగ్రిని అందజేసి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గరీబ్ కా దర్ద్ ట్రస్ట్ అధ్యక్షులు హాజీ జీలాన్ బాషా ఖజాంచి ఆకుల అబ్దుల్, సభ్యులు అలీ హోండా, సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను కలసిన టిడిపి నాయకులు





సీఐని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

**అనంతపురం రూరల్, జూన్ 06 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ యాదవ్‌ను అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ టిడిపి నాయకులు శనివారం ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఐ శ్రీకాంత్ యాదవ్ ను కలిసిన వారిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బద్దెల మంజునాథ్, నాగరాజు, రూరల్ మండల కార్యదర్శి దుర్గం రవీంద్ర కుమార్, యలెటి గోపాల్, ఎర్రిస్వామి, మల్ రాయుడు, వీరేష్, రాజా, దస్తగిరి, క్రిష్ణ, వెంకట్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## పాలిటెక్నిక్ దరఖాస్తుల గడువు జూన్ 22 వరకు పొడిగింపు

**రామగిరి, జూన్ 6 ప్రభాతవార్త**

మండల కేంద్రంమైన రామగిరిలో గల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 22వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాటు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారికి మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9391878837, 9885527674లో సంప్రదించాలని వారు తెలియజేశారు.

03ATP06.qxd:03ATP06.qxd 07/06/26 12:11 AM Page 1



## నీట్ పరీక్షా లీకేజీకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి - ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి

అనంతపురం న్యూటౌన్, జూన్ 06 ప్రభాతవార్త

నీట్ పరీక్షా లీకేజీకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాని ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి డిమాండ్ చేశారు. శనివారం జాతీయ సమితి పిలుపులో భాగంగా అనంతపురం నగరంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పేద మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. దాదాపు 28 లక్షల మంది విద్యార్థులకు పైగా ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యను పూర్తి చేసుకొని నీట్ ప్రవేశ పరీక్ష ప్రిపేర్ అయ్యి మరి కొంతమంది విద్యార్థులు లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని పరీక్ష రాస్తే ఇప్పుడు పరీక్ష పేపర్ లీకేజ్ అయిందని నీటి పరీక్షను రద్దు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నీ ప్రవేశ పరీక్షను డబ్బులకు అమ్ముకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని కేంద్ర విద్యా శాఖ నిర్లక్ష్యం వల్లనే ఇలా రెండు సంవత్సరాల లో పేపర్ లీకేజ్ కావడం జరిగిందని తెలిపారు తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్టిఏ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర వ్హి స్తామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు.. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు నగర అధ్యక్షులు మంజునాథ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు నగర నాయకులు హరికృష్ణ తేజ సుశ్రుత్ రాజు భాష యశ్వంత్ కార్తీక్ ఉమేష్ బబ్లు సురేష్ బ్రహ్మా స్వామి నరేష్ సాయి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

## హంద్రీనీవాలో జరిగిన అవినీతిపై సిబిఐ విచారణ జరపాలి - నేత కే.వి.రమణ డిమాండ్

అనంతపురం, జూన్ 06 ప్రభాతవార్త బ్యూరో

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీ నీవా లైనింగ్ పనుల్లో జరిగినా అవినీతిపై సిబిఐ విచారణ జరిపించాలని, పనులు చేసిన కొద్ది నీళ్లకే కాలువ గట్లు కొట్టుకుపోయాయని వైసిపి గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధి కేవీ రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హంద్రీ నీవా లైనింగ్ పనుల్లో అవినీతి జరిగిందని గత డిసెంబరు 9వ తేదీన హంద్రీనీవాలో నీళ్లకు తమ గ్రౌండ్ పరిశీలనలోనే తేటతెల్లమైందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆగమేఘాల మీద డిసెంబర్ 3,20 24 న హంద్రీనీవా మొదటి దశ వెడల్పు, రెండవ దశ లైనింగ్ పనులకు 3850 కోట్లు ఖర్చు చేసి 100 రోజులలో పూర్తి చేసినట్లు ప్రకటించుకున్నది అన్నారు. మొదటి దశ వెడల్పు పనులకు 950 కోట్లు, రెండవ దశ లైనింగ్ పనులకు సుమారు 2,900 కోట్లకు టెండర్లు పిలిచి తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. హంద్రీ నీవా లైనింగ్ పనుల్లో కొన్ని ప్యాకేజీల కింద పనులను నాసిరకంగా చేయడం వల్ల గత ప్రవాహానికే కొట్టుకుపోయింది. ఈ పనులు నాణ్యతగా ఉండాలంటే మొదట కాలువపై కంప చెట్లను తొలగించి అడుగు భాగంలో ఇంక్లైన్డ్ రోలర్ తో గట్టిపరచి ఆ తర్వాత 12 ఎంఎం, 20 యంయం గ్రానైట్ కంకర, నాణ్యమైన ఇసుక, సిమెంట్‌తో తయారు చేసిన ఎం 25 మిక్చర్‌తో ఫేవర్ మిషన్ ద్వారా కాలువ ఇరువైపులా లైనింగ్ చేయాలి. ఆ తరువాత అడుగు భాగంలో లైనింగ్ వేసి దీనిని రెండు వారాలపాటు క్యూరింగ్ చేయాలి. ఎక్కడైనా రాతి పొరలు ఉన్న ప్రాంతంలో షార్ట్ క్రీటింగ్ విధానంలో లైనింగ్ చేయాలి, ఈ పనులను జరుగుతున్నప్పుడు సంబంధించిన ఇంజనీర్లు నిరంతరం దగ్గరుండి పర్యవేక్షణ చేయాలి. సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ శాంపుల్స్‌ను తీసి లేబరేటరీలో పరీక్ష చేసి నాణ్యతను ధ్రువీకరించాలి, ఇవేవీ లేకనే పనులు పూర్తి చేసేశారు. ఈ లోపాలను గత ఏడాది డిసెంబర్ 9వ తేదీన కాలువలో నీళ్లు ప్రవహిస్తున్నప్పుడే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సంస్థ రాష్ట్ర కమిటీ పరిశీలనలో బయటపడింది అని ఆయన వివరించారు. ఆనాడే కమిటీ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదు, నేడు సత్యసాయి జిల్లాలో మానవ లైనింగు వెడల్పాలలో అవినీతి జరిగిందని స్పష్టంగా కనబడుతోంది కేవీ రమణ అన్నారు. రెండవ దశ కింద చేసిన పనులు లైనింగ్ కాబట్టి బయటి కనబడుతున్నది. వెడల్పు పేరుతో చేసిన మొదటి దశ పనులు కేవలం క్లీన్ చేసి బిల్లులు చేసుకున్నట్లు తెలుస్తుంది, ఈ పనులు నీటి ప్రవాహానికి కనిపించవు. నిజంగానే వెడల్పు చేసి ఉంటే ప్రతిరోజు 3850 క్యూసెక్కులు నీరు వచ్చి ఉండాలి, అలా వచ్చి ఉంటే మూడు రోజులకు ఒక టిఎంసి రావాలి, ఈసారి 8 నెలల కాలం కాలువలో నీళ్లు ప్రవహించాయి, అంటేమూడు రోజులకు ఒక టీఎంసీ, నెలకు పది టీఎంసీల ప్రకారం 8 నెలలకు 80 టీఎంసీలు వచ్చి ఉండాలి. అయితే అధికారికంగా 50 టీఎంసీలు మాత్రమే వచ్చినట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. దీనిని బట్టి కాలువ వెడల్పు పనులు జరగలేదని అర్థం అయిపోతుంది. ఈ విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల పేర్లతో నీళ్లకు బదులు అవినీతిని పారిస్తున్నది. రైతుల ప్రయోజనాలను తుంగలో తొక్కి కాంట్రాక్టర్లకు మేలు చేస్తున్నది. 3850 కోట్ల విలువ కలిగిన హంద్రీనీవా పనులపై సిబిఐ విచారణ చేసి, పనుల నాణ్యతను, జరిగిన అవినీతిని తేల్చి సంబంధిత కాంట్రాక్ట్ సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టాలని కే.వి రమణ డిమాండ్ చేశారు.

## తవాసీల్దార్ ను కలిసిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్

అనంతపురం క్రైమ్ జూన్ 6 ప్రభాతవార్త

అనంతపురం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు కోడేరు తహసిల్దార్ మోహన్ కుమార్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తహసిల్దార్ కొత్తగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు మాజీ ఉప మండల అధ్యక్షుడు జల్లప్ప, అక్కులన్న, అశోక్, రమణ తదితరులు పాల్గొన్నారు.



తవాసిల్దార్: కూడేరు తవాసీల్దార్ ను కలిసిన నాయకులు

## నవచేతన శిక్షణా కార్యక్రమం పై అవగాహన



అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ

నల్లమాడ, జూన్ 6 ప్రభాతవార్త,,

నవ చేతన శిక్షణా కార్యక్రమం పై నల్ల మాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ గాయత్రి మాట్లాడుతూ ఆరు సంవత్సరములు వయసు గల చిన్నారులకు ప్రత్యేక ఆరోగ్య శ్రీ స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారుల కు పుట్టుకతో వచ్చే లోపాలను ముందస్తుగా గుర్తించి వాటి నివారణకు వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో చిన్నారుల ఆరోగ్య సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సేవలు అందించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. పోషకాహార లోపాలు, రక్తహీనత, శారీరక ఎదుగుదలలో సమస్యలను, మానసిక ఎదుగుదలలో లోపాలు తదితర వాటిని గుర్తించి వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధం గా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఆహారం, పరిశుద్ధత, బాలల సర్వతో ముఖాభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో 1033 ర్యాంక్ సాధించిన ఫక్రుద్దీన్ విజ్ఞాన్ పాఠశాల విద్యార్థి నితీష్ కుమార్

కదిరి, జూన్ 6 ప్రభాతవార్త

జేఈఈ అడ్వాన్స్‌లో ఫక్రుద్దీన్ విజ్ఞాన్ పాఠశాల పూర్వ విద్యార్థి తన అద్భుత ప్రతిభను కనబరిచి విజ్ఞాన్ పాఠశాల కీర్తిని మరింత ఇనుమడి ంపజేశాడు. విజ్ఞాన్ పాఠశాల పూర్వ విద్యార్థి నితిన్ కుమార్ 1033 ర్యాంకు సాధించి తాను చదివిన విజ్ఞాన్ పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చాడు.. ఈ విద్యార్థి ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విజ్ఞాన్ పాఠశాలలో విద్యను అభ్యసిం చాడు. తాను ఇంతటి ప్రతిభాపాటవాళ్లకు ఆలవాలంగా నిలిచిన తమ గురువు ల వద్ద ఆశీర్వాదం తీసుకోవడానికి శనివారం పాఠశాలకు వచ్చిన నితీష్ కుమార్ ను విజ్ఞాన విద్యాసంస్థల చైర్మన్ మారగానికుంట్ల ఫక్రుద్దీన్ దంపతు లు శాలువాతో బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఫక్రుద్దీన్ మాట్లా డుతూ ప్రతిభాపాటవాలు కలిగిన విద్యార్థినీ విద్యార్థులకు ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అంతేకాక చదువుల లోమం చి ప్రతిభ ఉండి, మంచి మార్కులు తెచ్చుకున్న నిరుపేద విద్యార్థులకు ఎల్లవేళలా తమ వంతు తోడ్పాటు అందిస్తానన్నారు. జేఈఈలో ర్యాంకు తీసుకున్న నితీష్ కుమార్ మరెన్నో విజయాలు సాధించాలని ఫక్రుద్దీన్ ఆంకాంక్షించారు.




విద్యార్థి నితీష్ కుమార్‌ను దుశ్శాలతో సత్కరించి బహుమతిని ప్రధానం చేస్తున్న ఫక్రుద్దీన్ దంపతులు

## ముగిసిన సమ్మర్ ఓరియెంటేషన్ క్యాంపు

శింగనమల, జూన్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శింగనమల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియెంటేషన్ క్యాంపు శనివారం ముగిసినట్లు గ్రంథాలయ అధికారి జి.కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమ్మర్ క్యాంపు లో పాల్గొన్న విద్యార్థు లకు బహుమతులు అందిం చినట్లు తెలిపారు.



విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

## అనంత సాయి మహా సంగ్రామం జయప్రదం చేయండి

అనంతపురం న్యూటౌన్, జూన్ 6 ప్రభాతవార్త

స్థానిక ఎపిజిఈఎ కార్యాలయంలో సిపిఎస్ ఉద్యోగులు జూలై 11న నిర్వహించే అనంత సాయి మహా సంగ్రామం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపిసిపిఎస్ఈఎ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగదీష్, రవికుమార్ ఎపిజిఈఎ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపికృష్ణ, రాము నాయక్ సాంబశివమ్మ మాట్లాడుతూ.. జూలై 11వ తేదీన సత్యసాయి జిల్లా అనంతపురం జిల్లా లోని అన్ని శాఖలు పెద్ద ఎత్తున వేలాది ఉద్యోగులతో సిపిఎస్ రద్దు కోసం నిరసన కార్యక్రమం చేయనున్నామని తెలిపారు. అందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల నుండి టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించి అనంతరం లలిత కళాపరిషత్‌లో సభా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని శాఖల సిపిఎస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు వనాయకులు ప్రభాకర్, ఎర్రి స్వామి, నవీన్ కుమార్, సంగప్ప, వన్నూరు స్వామి, సుధాకర్ నాగేంద్ర, వరదరాజులు, నాగభూషణ, రామన్న, హనుమంత రాయుడు, మహేశ్వర్ రెడ్డి నాగరాజు, సతీష్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం - గ్రంథాలయాలకు విజ్ఞాన నిలయాలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 6 ప్రభాతవార్త

జిల్లా కేంద్ర గ్రంథాలయం అధ్యక్షులు, కార్యదర్శి ఆదేశాల మేరకు వేసవి విజ్ఞాన కార్యక్రమం ముగింపు వేడుకలు డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవికాంత్ క్యాటరింగ్ రమణ (మీనాక్షి ఫౌండేషన్ చైర్మన్), రిటైర్డ్ ఎక్సైజ్ డి.ఎస్ పి.శ్రీహరి, రిసోర్స్ పర్సన్స్ పుట్లూరు శ్రీరాములు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, యోగ మాష్టారు వెంకటేశప్ప, తెలుగు లిటరిచర్ ఉపాధ్యాయులు డా.అంకె రామలింగయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వై.సూర్యనారాయణ రెడ్డి , డ్రాయింగ్ మాస్టర్ వినోద్ కుమార్, యోగ గురూజీ మల్లికార్జున, స్టోరీ టెల్లింగ్ టీచర్ మహేష్ పాల్గొన్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ. .విద్యార్థులు ఎంతో ఆసక్తి తో పాల్గొని ఈ వేసవి విజ్ఞాన శిబిరలను విజయవంతం చేశారని తెలియజేసారు. ఈ సమ్మర్ క్యాంపు లో ప్రతి రోజు నిర్వహిస్తున్న ఇంగ్లీష్ గ్రామర్, యోగ, డ్రాయింగ్, డాన్స్, మోటివేషన్ క్లాస్సెస్ మొదలగు వాటి వల్ల విద్యార్థులు ఎంతో కొంత కొత్త విషయాలు రోజు నేర్చుకుంటున్నారని తెలియజేసారు. అనంతరం ఈ వేసవి శిక్షణ కార్యక్రమాలకు ఎంతో ఆసక్తిగా విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులకు అతిధులు పార్టిసిపేట్ సర్టిఫికెట్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గ్రంథాలయధికారి కమ్మన్న, ఉపాగ్రంథాలయం అధికారి డి.గోవిందు, గ్రంథాలయ సిబ్బంది, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## శింగనమలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు - జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కవిత



ఉచిత బుక్కులు పంపిణీ చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ జి.కవిత

శింగనమల, జూన్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి సైన్స్ గ్రూపులైన బైపిసి, ఎంపిసి, ఎంఎల్‌టి గ్రూపులను కొత్తగా ప్రారంభిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత పేర్కొన్నారు. శనివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామీన ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వంశింగనమలలో జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులను ఏర్పాటు చేసిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, అనుభవజు ్లలైన అధ్యాపకులు, ల్యాబ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు తిరిగి వెళ్లలేని విద్యార్థులకు కెజిబివి టైప్-4 హాస్టల్ ఏర్పాటు చేసినట్లు, అంతేకాకుండా మధ్యాహ్న భోజనం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మరిన్ని వివరాల కోసం కాలేజ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించాలన్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి - ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్




మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 06 ప్రభాతవార్త

ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించి, వారిలో టెట్ టెన్షన్ తొలగించి, బోధనపై దృష్టి పెట్టేలా సహకరించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి విజ్ఞప్తి చేస్తుస్తున్నట్లు ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పేర్కొన్నారు. మెజారిటీ సీనియర్ టీచర్లకు కంప్యూటర్ పైన అవగాహన లేని కారణంగా ఇన్ సర్వీస్ టీచర్లకు ఆఫ్ లైన్ పరీక్ష నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులకు 40, బీసీలకు 50, ఓసీలకు 60 టెట్ అర్హత మార్కులు పెట్టారు. అయితే డిపార్ట్ మెంటల్ పరీక్షల మాదిరిగా టెట్‌లో కూడా ఇన్ సర్వీస్‌లోని అన్ని వర్గాల టీచర్లకు టెట్ అర్హత మార్కులు 40 శాతం పెట్టాలని మనవి చేస్తున్నాం. ఎంఈఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నాతోపాటు ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లప్పగారి గంగాధర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సాకే అమర్ నాథ్, జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి - డిటిఎఫ్ నేతలు

కదిరి, జూన్ 06 ప్రభాతవార్త

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయించే విధంగా చట్ట సవరణ చేయాలని లేదా ప్రత్యేక టెట్ నిర్వహించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి షర్ఫోద్దీన్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి. మారుతి ప్రసాద్, కట్టుబడి గౌస్ లాజమ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టెట్ నిర్వహణపై డిటిఎఫ్ నాయకులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు పదోన్నతులు, బదిలీలు, ఇతర సర్వీస్ ప్రయోజనాలకు టెట్ తప్పనిసరి కావడంతో ఆఫ్లైన్లో సంవత్సరానికి రెండుసార్లు టెట్ నిర్వహించాలని ప్రకటనలో కోరారు. 45 సంవత్సరాల పైబడి వయసున్న టీచర్లు ఆన్లైన్ పరీక్షల్లో సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అందువల్ల వారికి ఆఫ్ లైన్లో పరీక్షలు నిర్వహించే ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తీర్ణతాశాతం అందరికీ ముప్పై ఐదు శాతం మార్కులకు తగ్గిస్తూ, వారికి సంబంధించిన సబ్జెక్టుల్లో సామర్థ్యాలు పరిక్షించే విధంగా టెట్ నిర్వహించాలని కోరారు. 100 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న పదవ తరగతి ఉపాధ్యాయులు సిసిఎల్స్, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో పాల్గొన్న, వేసవి సెలవులు ఎఫ్ఎల్ఎం తరగతుల్లో పాల్గొన్న వారికి సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు.

## తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మమ్మ

నంబులపూలకుంట, జూన్ 6 ప్రభాతవార్త

ఎన్.పి కుంట నూతన తాసిల్దారుగా లక్ష్మమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బదిలీలో భాగంగా డిప్యూటీ తహసిల్దార్ నుండి పదోన్నతులు పొంది తహసిల్దార్ బాధ్యతలు స్వీకరిం చడం జరిగింది అని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. మండలంలో ఎటువంటి సమస్య ఉన్న మా దృష్టికి వస్తే పరిష్కరించే తోడ్పడుతామని తెలిపారు.



తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మమ్మ

## తహశీల్దారు సూర్య ప్రతాప్‌కు ఆత్మీయ సన్మానం

శింగనమల, జూన్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా (రెవెన్యూ) విధులు నిర్వహిస్తున్న సూర్య ప్రతాప్ పదోన్నతిలో భాగంగా రాయదుర్గకు తహశీల్దారుగా బదిలీ అయ్యారు. అందులో భాగంగా శనివారం శింగనమల తహశీల్దారు శేషారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆయనకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు నారాయణస్వామి, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకు మార్, ఎలక్షన్ డిటి ఖానుమ్, ఆర్ఐ బసిరున్నీసా, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, విఆర్ఓలు సర్వేయర్లు పెద్ద ఎత్తున పాల్గొ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



తహశీల్దారు సూర్య ప్రతాప్‌ని సన్మానిస్తు రెవెన్యూ ఉద్యోగులు

## ఘనంగా ఘనంగా శ్రీనివాసులు నాయక్ జన్మదిన వేడుకలు



శ్రీనివాసులు నాయక్‌కు కేకు తినిపిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి



ఆలూరు సాంబశివారెడ్డిని, శ్రీనివాసులు నాయక్‌ను గజమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు

శింగనమల, జూన్ 6 ప్రభాతవార్త

వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం వైఎస్ఆర్‌సిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైఎస్ఆర్‌సిపి శ్రేణులు ఆలూరు సాంబశివారెడ్డిని, శ్రీనివాసులు నాయక్‌ను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ సమన్వయ కర్త ఎం.వీరాంజినేయులు, కనంపల్లి నరేందర్‌రెడ్డి, రామకృష్ణ నాయక్, కాటమయ్య, వైఎస్ఆర్‌సిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దారు సూర్య ప్రతాప్‌కు ఘన సన్మానం

శింగనమల, జూన్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా (రెవెన్యూ) విధులు నిర్వహిస్తున్న సూర్య ప్రతాప్ పదోన్నతిలో భాగంగా రాయదుర్గంకు తహశీల్దారుగా బదిలీ అయ్యారు. అందులో భాగంగా శనివారం శింగనమల తహశీల్దారు శేషారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆయనకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చెన్నప్పయాదవ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ యాదవ్, సీపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్, సహాయ కార్యదర్శి చేనేత మధులు శాలువాతో సత్కరించి పల బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు తహశీల్దారు శేషారెడ్డి, రీ సర్వేయర్ డిటి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దారు సూర్య ప్రతాప్‌కు స్వీటు తినిపిస్తున్న చెన్నప్ప యాదవ్

## నవచేతన కార్యక్రమంపై శిక్షణ

యల్లనూరు, జూన్ 6 ప్రభాతవార్త

నవచేతన కార్యక్రమంపై శనివారం అంగన్‌వాడి కార్యకర్తలకు ఐసిడిఎస్ సిడిపిఓ ఎం.భారతి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా 0-6 సంవత్సరాల పిల్లలకు నిర్వహించాల్సిన ఆరోగ్య పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ చిన్నారుల్లో ఎదుగుదల అభివృద్ధికి సంభందించిన లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించాలని తెలియచేశారు. అలా గుర్తించడం వల్ల వైద్యాధి. కారులతో తగిన వైద్య సేవలు అందించి వారి సమగ్ర అభివృద్ధికి తోడ్ప డవచ్చని తెలిపారు. పిల్లలకు స్క్రీనింగ్ నిర్వహించిన విధానం తల్లి దండ్రులు సమక్షంలో నవచేతన యాప్ ద్వారా వివరాలు నమోదు చేసే ప్రక్రి య అంగన్‌వాడి కార్యకర్తలుకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జి.రాజమణి, పిసి శాంతమ్మ, మండలంలోని 44 అంగన్‌వాడీల కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడి కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

## మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ఒక్కరోజు శిక్షణ

అమడగూరు, జూన్ 6 ప్రభాతవార్త

అమడగూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు శనివారం మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఎం.సంపూర్ణ, జెడ్‌పిహెచ్ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి పాల్గొని మధ్యాహ్న భోజనం తయారు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూను పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలని ఏజెన్సీలకు సూచించారు. అదేవిధంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పరిశుభ్ర వాతావరణంలో భోజనం చేసి పిల్లలకు ఆరోగ్యకరమైన భోజనం అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్ఎంటిఎస్‌లు పాల్గొన్నారు.



భోజనం ఏజెన్సీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

## "నవచేతన" శిక్షణపై అంగన్‌వాడి కార్యకర్తలకు అవగాహన

అమడగూరు, జూన్ 6 ప్రభాతవార్త

అమడగూరు మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో శనివారం "నవచేతన" శిక్షణపై అంగన్‌వాడి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.గంగాదేవి మాట్లాడుతూ 0-6 సంవత్సరాల చిన్నారులకు ప్రత్యేక ఆరోగ్య స్క్రీనింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లోపాలను ముందస్తుగా గుర్తించి తగిన వైద్యసేవలు అందించమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. ప్రతి అంగన్‌వాడి కేంద్రం పరిధిలోని చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సేవలు అందించాలని కార్యకర్తలకు సూచించారు. పోషకాహార లోపాలు, రక్త హీనత, శారీరక ఎదుగుదల సమస్యలు, మానసిక అభివృద్ధి లోపాలు, తదితర అంశాలపై వైద్య సిబ్బంది ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. "నవచేతన్" యాప్‌ను అంగన్‌వాడి కార్యకర్తలు డౌన్‌లోడ్ చేసుకుని పిల్లల్లో ఐదు దశలను గుర్తించడానికి ఉపయోగకరంగా వుంటుం దన్నారు. చిన్నారుల్లో స్థూల, సూక్ష్మ, చలన, భాషా, జ్ఞాన సామా జిక బావోద్వేగాలను అభివృద్ధి చేయడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని ఆమె తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ రెడ్డి రమణమ్మ, ఏపిఎం భారతి, మెడికల్ ఆఫీసర్ చందన్‌కుమార్, ఎంపిడిఓ శకుంతలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఇర్ఫాన్‌బాష, పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడి కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

## ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

యాడికి, జూన్ 6 ప్రభాతవార్త

యాడికి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వతేదీ వరకు 40 రోజుల పాటు శిక్షణా శిబిరం నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎం.మధు సూదన్ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ అరుణ్, ఉపాధ్యాయులు కోటి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు కోటి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చిన్నతనం నుండి గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అరుణ్ మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా తొడుక్కో - ఒక మంచి పుస్తకం కొనుక్కో అని పుస్తకం విలువను పుస్తకం ఆవశ్యకత గురించి తెలియచేశారు. పుస్తకం ఒక మంచి నేస్తమని పుస్తకాలను చదివే అలవాటు చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలన్నారు. నేటి చరిత్ర భావితరాలకు అందించే ఒక అద్భుతమైన రూపమే పుస్తకం అన్నారు. అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానమనే జ్యోతిని మనలో వెలిగించి ముందుకు నడిపేసాధనమే పుస్తకమని తెలియజేశారు. అనంతరం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం మధుసూధన్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందచేస్తున్న దృశ్యం

## శ్రీరంగనాథునికి విశేష పూజలు

తాడిపత్రిఅర్బన్, జూన్ 6 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు వెంకట్రావు, కిరణ్‌స్వామిలు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, ఆకు పూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కోన లో వెల సిన ఆంజనేయస్వామి, షిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఓగేటి రంగనా యకులు, ఆలయ ఇఓ రామాంజనేయులు, సిబ్బంది కాశీ, భక్తులు పాల్గొన్నారు.



రంగనాథస్వామిని అలంకరించిన దృశ్యం

## వైసిపి ట్రేడ్ యూనియన్ కమిటీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ప్రశాంత్‌రెడ్డి

తనకల్లు, జూన్ 6 ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా వైఎస్ఆర్‌సిపి ట్రేడ్ యూనియన్ కమిటీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తనకల్లు మండలం బాలసుమంగళ గ్రామానికి చెందిన జి.ప్రశాంత్‌రెడ్డిని అధిష్టానం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించడం పట్ల అధిష్టానానికి ప్రత్యేక హృదయపూర్వక ధన వ్యావాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజల సేవకు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి తనకు అవకాశం కల్పించడం పట్ల వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు కదిరి వైఎస్ఆర్‌సిపి ఇన్‌చార్జ్ మక్బుల్, జిల్లా నాయకులు, మండల కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



అక్కుల్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న ప్రశాంత్‌రెడ్డి

04ATP06.qxd:04ATP06.qxd 07/06/26 11:36 PM Page 1



## జిల్లాలో యోగాంధ్ర2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురము కలెక్టరేట్ జూన్ 6 ప్రభాతవార్త

ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న యోగాంధ్ర2026 కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లాలో దివ్యాంగ థీమాటిక్ యోగా, టూరిజం డెస్టినేషన్ యోగా తదితర యోగాంధ్ర2026 కార్యక్రమాలను షెడ్యూల్ మేరకు నిర్వహించాలన్నారు.

యోగాంధ్ర2026 కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లు, రిజిస్ట్రేషన్లు, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలను పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భ ంగా ప్రజలకు యోగాను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర 2026 కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 16న దివ్యాంగులతో థిమాటిక్ యోగా, 18న బుగ్గ రామలిం గేశ్వర స్వామి ఆలయం, 20న గుత్తి కోటలో ప్రత్యేక పర్యాటక డెస్టినేషన్ యోగా ప్రదర్శనలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. యోగకు సంబందించిన అన్ని వివరాలు ఎప్పటి కప్పుడు యాప్ లో అధికారులు నమోదు చేయాలని, ప్రి ఈవెంట్ కార్యక్రమాల నమోదు, పాల్గొనే వారి వివరాల అప్లోడ్, పోస్ట్ ఈవెంట్ ఫోటోలు మరియు సమాచారం సకాలంలో అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిం చబడేలా పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.


కలెక్టర్ ఓ.ఆనంద్

## 15 ఏళ్ల తర్వాత జనాభా తగ్గిందా.....! జిల్లా కలెక్టర్ ఆశ్చర్యం

వజ్రకరూరు జూన్ 6 ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన గణన కార్యక్రమం ... క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంగా.. వ్యవహరిస్తుడంతో ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వజ్రకరూరు గ్రామ మొత్తం జనాభా 7925 కాగా 15 సంవత్సరాల తర్వాత అనగా 2026లో జనగన్ని చేపట్టగా 7318గా అధికారులు లెక్క తేల్చారు. మండల స్థాయి నుండి వెళ్లిన నివేదికలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వజ్రకరూరు జనాభా ను పరిశీలించి 2011 నుండి 2026 సంవత్సరానికి 311 మంది జనాభా తగ్గి ఉండడాన్ని గమనించి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ విషయంపై అధికారులను మందలిచ్చినట్టుగా విశ్వసనీయ సమాచారం. 15 సంవత్సరాలకు జనాభా పెరుగుదల లేక తగ్గినట్టుగా చూపించారు. దీంతో జనగణనపై అయన సందేహం వెలుబుచ్చారు. వీటికి సంబంధి ంచి పూర్తి నివేదికను ఇవ్వాల్సిందిగా డిపిఓను నాగరాజు నాయుడును ఆదేశించారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో గౌస్ సాహెబ్, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో మరో మారు సర్వే నిర్వహించి ఖచ్చితమైన వివరాలను అందజేయాలని ఆదేశించారు. అధికారు లు వెంటనే తిరిగి ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. 2026 నాటికి కూడా వజ్రకరూరు గ్రామ మొత్తం జనాభా 7925 గానే తిరిగి నిర్ధారించడం విశేషం.


ఇంటింటికి వెళ్లి రీసర్వే చేస్తున్న అధికారులు

## కూటమి పాలనలో మైనార్టీలకు జరుగుతున్న మోసంపై విస్తృత ప్రచారం చేపట్టండి

### - ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తంగా ఉన్నండి - జిల్లా మైనార్టీలకు సూచించిన సజ్జల

అనంతపురం సిటీ, జూన్ 6 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైనార్టీలకు జరుగుతున్న మోసాలపై విస్తృత ప్రచారం జిల్లా మైనార్టీ నేతలకు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణరెడ్డి సూచించారని మైనార్టీ నేతలు పేర్కొన్నారు. తాడేపల్లి వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మైనార్టీ విభాగం రాష్ట్ర స్థాయి సమావేశానికి అనంతపురం జిల్లా మైనార్టీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వైసిపి ముఖ్య నేతలు సజ్జల రామకృష్ణరెడ్డి, అప్పిరెడ్డిలను జిల్లా మైనార్టీ నేతలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు జిల్లా మైనార్టీ నేతలకు దిశ నిర్దేశం చేస్తూ వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో మైనార్టీలకు సముచిత స్థానం కల్పించామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మైనార్టీలకు అనేక హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేస్తోందని, వాటిని మైనార్టీ వర్గాల్లోకి తీసుకెళ్లాలని సూ చించార న్నారు. అదే విధంగా ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ విషయంలో మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఓటు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మహ్మద్ వసీం, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గౌస్‌బేగ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిలు వేముల నదీమ్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.


సజ్జలతో వైసిపి అనంత నేతలు

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట

నంబులపూలకుంట, జూన్ 6 ప్రభాతవార్త

కదిరి నియోజవర్గం నంబులపులకుంట మండలం చామలగొంది సర్పంచ్ శివప్పనాయుడు గత కొద్ది రోజుల క్రితం ప్రమాదంలో గాయపడి మదనపల్లిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సర్పంచ్ శివప్పనాయుడు పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట

## తలపోటును తేలికగా తీసుకోవద్దు

### - వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే జూన్ 8న - కిమ్స్ సవీర కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా.సి.అనిల్

అనంతపురం, జూన్ 06 ప్రభాతవార్త బ్యూరో

తలనొప్పి.. ఎప్పుడో ఓ సారి అయితే పర్వలేదు. కానీ, క్రమంతప్పకుండా వస్తుంటే కచ్చితంగా జాగ్రత్త పడాలి. ఎందుకంటే ఇది బ్రెయిన్ ట్యూమర్‌కి లక్షణంగా రావొచ్చు. తలనొప్పి ఉన్నవారందరికీ ట్యూమర్ ఉన్నట్లు కాదు. కానీ, బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారికి మాత్రం తలనొప్పి వస్తుంది. ఈ విషయాన్ని కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలి అని కిమ్స్ సవీరా కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా.సి.అనిల్ పేర్కొన్నారు. జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా ప్రభాతవార్త ద్వారా.. తరచూ తలనొప్పి వచ్చే విషయాలను ప్రజలకు వివరించారు. రెగ్యులర్‌గా తలనొప్పి వస్తే అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు. ఇందుకోసం ప్రజల్లో ఈ ట్యూమర్లు (కణితుల) గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం జూన 8వ తేదీన వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే ని నిర్వహిస్తారు. అనేక అవగాహన కార్యక్రమాల ద్వారా ఈ కణితుల వల్ల వచ్చే ప్రమాదాల గురించి తెలియజేస్తారు. మన శరీరంలో ఎన్నో అవయవాలు ఉంటాయి. ప్రతి అవయవం కూడా అనేక కణాలతో నిర్మితమై ఉంటుంది. ఇంతకంటే ఎక్కువ జీవకణాలు ఒకదానితో ఒకటి కలిసి ఏర్పడితే, అది కణితి రూపాన్ని తీసుకుంటుంది. వైద్య భాషలో క్యాన్సర్ అంటారు. మెదడులో కూడా కొన్ని జీవకణాలు సమూహంగా మారి కణితిగా ఏర్పడుతుంది. మెదడులోని ఏ భాగంలోనైనా ఈ సమస్య వస్తుంది. దీనినే బ్రెయిన్ క్యాన్సర్ అంటారు. ఈ కణాలు నియంత్రణ లేకుండా సక్రమంగా పెరుగుతాయి. కణజాలాలను నాశనం చేస్తాయి. బ్రెయిన్ క్యాన్సర్‌ని బ్రెయిన్ ట్యూమర్ అని కూడా అంటారు. కణాలు మరింత వేగంగా పెరిగేకొద్దీ.. కణాలు కూడా పెరుగుతాయి. దీంతో బ్రెయిన్ పనితీరు మారుతుంది. సరైన ట్రీట్‌మెంట్ లేకుంటే అనేక సమస్యలొస్తాయి.

**లక్షణాలు :** బ్రెయిన్ క్యాన్సర్ విషయంలో ముందునుంచే జాగ్రత్తగా ఉండాలి. ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. లక్షణాలను గురించాలి. కొంతమందికి లక్షణాలు త్వరగా కనిపిస్తాయి. కొంతమందిలో ఉండవు. లక్షణాలలో తలనొప్పి ఒకటి. ఇది రెగ్యులర్‌గా ఉంటే సమస్య ఉన్నట్లే. దీనిని అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు.

**మరిన్ని లక్షణాలు :** రాత్రుళ్ళు తలనొప్పి వికారం శరీర భాగాలు పట్టుకోవడం సరిగ్గా ఆలోచించలేకపోవడం కళ్ళు కనిపించకపోవడం నడుస్తున్నప్పుడు ఇబ్బంది మాట్లాడలేకపోవడం కళ్ళు తిరగడం.

**కారణాలు :** మెదడు కణితుల కారణాలు ఎక్కువగా తెలియవు. తలలో రేడియేషన్ ఉన్న పిల్లలకు పెద్దయ్యాక బ్రెయిన్ ట్యూమర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అలాగే, కొన్ని అరుదైన జన్యుపరమైన పరిస్థితులు ఉన్నవారికి మెదడు కణితుల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. మెదడు కణితులకు వయస్సు మరొక ప్రమాద కారకం. అధ్యయనాల ప్రకారం 60 మరియు 80 సంవత్సరాల మధ్య వయస్సు గల వారిలో మెదడు కణితులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.


డా.సి.అనిల్

**ఎలా గుర్తించవచ్చు :** సీటీ బ్రెయిన్, ఎంఆర్ఐ బ్రెయిన్, బ్రెయిన్ యాంజియోగ్రఫీ, ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీ.

**చికిత్స:** మెదడు కణితుల చికిత్సలో గరిష్ట సురక్షి తమైన శస్త్రచికిత్స విచ్ఛేదనం ఉంటుంది. ప్రాణాంతక కణితుల యొక్క కొన్ని సందర్భాల్లో, రేడియోథెరపీ, నోటి కెమోథెరపీ శస్త్రచికిత్స డీబల్కింగ్ తర్వాత నిర్వహిం చబడుతుంది. పూర్తి శస్త్రచికిత్స తొలగింపు ద్వారా పూర్తిగా మరియు జీవితాంతం నయం చేయవచ్చు. ప్రాణాంతక కణితుల యొక్క అనేక సందర్భాల్లో, ఖచ్చితమైన శస్త్రచికిత్స ఇతర నిర్వహణతో దీర్ఘకాలిక మనుగడ సాధ్యమవుతుంది.

ఫలితం మనుగడ రేటు ఎక్కువగా రోగి వయస్సు, కణితి రకం, అది నిరపాయమైనదా లేదా ప్రాణాంతకమైనదా, మరియు కణితి యొక్క శస్త్రచికిత్స ఎక్సిషన్ పరమాణు లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. మాలిక్యులర్ మార్కర్లపై ఇటీవలి అధ్యయనాలు మెదడు మరియు వెన్నెముక కణితుల్లో కొత్త చికిత్సా పద్ధతు లను వచ్చాయి. ఇప్పుడు మెదడు కణితులు కణితి యొక్క మాలిక్యులర్ స్టేజింగ్ ఆధారంగా చికిత్స పొందుతాయి. మునుపు మెదడు కణితి విచ్ఛేద నం పరిసర సాధారణ మెదడు దెబ్బతినడం వల్ల పేలవమైన ఫలితాలతో ముడిపడి ఉంది. ఇది నాడీ సంబంధిత లోపాలు, జీవన నాణ్యతకు దారితీసింది. కానీ స్టీరియోటాక్సిక్, బ్రెయిన్ మ్యాపింగ్, న్యూరో నావిగేషన్, నెర్వ్ మానిటరింగ్, మైక్రోస్కోప్, ఎండోస్కోప్, ఇంట్రాఆపరేటివ్ ఎంఆర్ఐ వంటి సర్జికల్ ఆర్మమెంటరియంలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం రావడంతో, సాధారణ మెదడుకు హాని కలిగించకుండా ట్యూమర్‌లను ఖచ్చితత్వంతో ఎక్సైజ్ చేయవచ్చు. చిన్న మెదడు కణితులను అనస్థీషియా లేకుండా స్టీరియోటాక్టిక్ బయాప్సీ తర్వాత స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీతో నిర్వహించవచ్చు. ముఖ్యమైన నిర్మాణాలపై ఉన్న కణితులను మేల్కొని క్రానియోటమీకి గురి చేయవచ్చు, అక్కడ రోగి మెలకువగా ఉన్నప్పుడు ప్రత్యేక అనస్థీషియాతో ఆపరేషన్ చేస్తారు మరియు సాధారణ మెదడుకు జరిగే నష్టాన్ని గుర్తించడానికి మౌఖిక ఆదేశాలకు ప్రతిస్పందిస్తారు.

## కేబుల్ వైర్ల దొంగతనం కేసు ఛేదించిన పుట్లూరు పోలీసులు - నిందితుడు అరెస్ట్

### - రూ.4 లక్షల విలువైన కేబుల్‌వైరు స్వాధీనం

పుట్లూరు, జూన్ 6 ప్రభాతవార్త

రైతుల వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్ల దొంగతనం కేసును పుట్లూరు పోలీసులు ఛేదించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ సత్యాబాబు వివరాలు వెల్లడించారు. పుట్లూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన దబ్బర వెంకటశివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గత నెల 27వతేదీ రాత్రి సమయంలో సూరేపల్లి గ్రామ శివారులోని అరటి తోటల్లో వున్న వ్యవసాయ బోరు మోటర్లకు ఏర్పాటు చేసిన కేబుల్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింద న్నారు. జిల్లా ఎస్పి జగదీష్ ఉత్తర్వుల మేరకు అనంతపురం డిఎస్ పి శ్రీనివాసులు ఆదేశాల మేరకు పుట్లూరు సిఐ సత్యాబాబు సూచనల మేరకు ఎస్ఐ సురేంద్రబాబు సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నిందితుడు తమ్మినేని మురళిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 4 లక్షల రూపాయల విలువైన 1397 మీటర్ల కేబుల్ వైరుతో పాటు 3 ఐరన్ పైపులు, మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. కేబుల్ వైరు చోరీకి పాల్పడుతున్న నిందితున్ని అరెస్ట్ చేయడం పట్ల సిఐ సత్యాబాబు, ఎస్ఐ సురేంద్రబాబు, ఏఎస్ఐ ఆదినారాయణ, కానిస్టేబుళ్ల రమేష్, నరేష్‌కుమార్, వెంకటరమణ, పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## 12వ తేదిలోపు హౌస్ మ్యాపింగ్ పూర్తి చేయండి - ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం

అనంతపురం క్రైమ్ జూన్ 6 ప్రభాతవార్త

ఈనెల 12వ తేదీలోగా హౌస్ మ్యాపింగ్ పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్, కోక్లస్టర్లు, యూనిట్, కో యూనిట్ ఇన్ ఛార్జిలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అసలు ఎస్ఐఆర్ ప్రక్రియ అంటే ఏంటి.. ఎందుకు చేస్తారన్నది నేతలు కూలంకశంగా వివరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ ఎస్ఐఆర్ ప్రాధాన్యతను ప్రత్యేకంగా చెప్పారు. ప్రతి 2025 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరి గణలోకి తీసుకుని సర్ ప్రక్రియను చేపడుతున్నట్లు చెప్పారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారన్నారు. ఈ విషయంలో పార్టీ నేతలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పర్ఫెక్ట్‌గా పూర్తి కావాలన్నారు. ఖిసర్ఖి ను అందరూ సీరియస్‌గా తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన తెలిపారు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత అని.. అలాగే ఓట్ల నమోదు చేయించే విధంగా పార్టీ శ్రేణులు చొరవ చూపాలన్నారు. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని.. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలు అమలు చేయగలమన్నారు. గతంలో వైసీపీ నాయకులు ఓట్ల విషయంలో చేసిన అక్రమాలను దృష్టిలో ఉంచుకో వాలన్నారు. ఎక్కడైనా అర్హులు కాని వారు ఓట్లు ఉంటే వెంటనే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రతి బీఎల్ఏ హౌస్ మ్యాపింగ్ ను పూర్తి చేయాలన్నారు. అవసరమైతే రెండవ సారి కూడా మ్యాపింగ్ కు వెళ్లాలన్నారు. ఈ వారం రోజులు చాలా కీలకమని.. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే దాని ప్రభావం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా పడుతుందన్నారు. అందుకే సర్‌ను అందరూ సీరియస్ గా తీసుకో వాలని.. ఎలాంటి నిర్లక్ష్ యం ఉండ కూడదన్నారు. పార్టీ అధిష్టానం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తోం దని.. ఎవరైనా నిర్లక్ష్య ంగా ఉంటే అది వెంటనే తెలిసిపో తుం దన్నారు. బీఎల్ఏల దగ్గర నుంచి క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్‌ల వరకు దీనిని బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్య దర్శి ఫిరోజ్ అహ్మద్, క్లస్టర్ ఇన్చార్జులు సరిపూటి రమణ, డిష్ నాగరాజు, రాజారావు, దలవాయి రమాదేవి, సాక్షి లక్ష్మీనరసింహ, వన్నూరప్ప, గోపాల్ గౌడ్, కృష్ణం రఘు, కాయగూరల శ్రీధర్, పొట్లూరి కేశవ నాయుడు, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్

## ఎస్ఐఆర్‌పై అనుమానాలు నివృత్తి చేయాలి

### - ఆల్ ఇండియా తన్జీమ్ ఏ ఇన్సాఫ్ డిమాండ్

అనంతపురం, జూన్ 6 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నగరంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ (సీపీఐ కార్యాలయం)లో ఆల్ ఇండియా తన్జీమ్ఏ ఇన్సాఫ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ.. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సవరణ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించబడినట్లు వచ్చిన వార్తలు ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయని అన్నారు.

ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, దానిని పరిరక్షించే బాధ్యత ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదే శ్‌లో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు చేపడు తున్న నేపథ్యంలో ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటర్ల పేర్లు తొలగించడం, కొత్త గా చేర్చడం వంటి ప్రక్రియలను బహిరంగంగా ప్రజల సమక్షంలో నిర్వహిం చాలని కోరారు. అనేక మంది వృద్ధులు, పేదలు, నిరక్షరాస్యులు జనన ధ్రువీకరణ పత్రాలు, పాత పాఠశాల సర్టిఫికెట్లు వంటి పత్రాలను సమర్పిం చడం కష్టసాధ్యమని పేర్కొంటూ, ఆధార్ కార్డు మరియు ఇతర సాధారణ గుర్తింపు పత్రాలను ఆధారంగా తీసుకుని ఓటు హక్కును కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మో హన్ రెడ్డి సర్ అంశంపై అప్రమత్తంగా ఉండాలని చెబుతు న్నారు. భారత ఎన్నికల సంఘం తో మాట్లాడి ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తన్జీమ్ఏ ఇన్సాఫ్ నాయకులు, అల్లీపీరా, ఖాజా హుస్సేన్, చాంద్ భాషా, బంగారు భాష, హాజీవలి, రఫీ, మున్న, సెక్షావలి తదితర ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.జాఫర్

## జేఈఈ అడ్వాన్స్‌2026లో శ్రీ చైతన్య విద్యార్థుల ఘన విజయం - అభినందించిన ఎస్పీ

అనంతపురం న్యూటౌన్, జూన్ 06 ప్రభాతవార్త

ఎఐఆర్-62, ఎఐఆర్-92తో పాటు 100లోపు 2 ర్యాంకులు, 1000 లోపు 4 ర్యాంకులు - ఎస్ఎస్సీలో 597 మార్కులతో మెరిసిన విద్యార్థులు ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌2026 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అనంతపురం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థి కొణంకి సమిత్ చౌదరి అఖిల భారత స్థాయిలో 62వ ర్యాంకు (ఎఐఆర్-62) సాధించగా, మరో విద్యార్థి అభిషేక్ కాంత్ 92వ ర్యాంకు (ఎఐఆర్-92) సాధించి సంస్థకు, అనంతపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. అంతేకాకుండా శ్రీ చైతన్య అనంతపురం విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ 2026లో అఖిల భారత స్థాయిలో 100లోపు 2 ర్యాంకులు, 1000లోపు 4 ర్యాంకులు సాధించి తమ ప్రతిభను దేశవ్యాప్తంగా చాటుక న్నారు. ఇక ఇటీవల విడుదలైన ఆంధ్రప్రదేశ్ పదవ తరగతి (ఎస్ఎస్సి) ఫలితాలలో కూడా శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. రాగసాయి, ఆర్యేంద్ర, శ్రేష్ఠ, శ్రీజ 600కు 597 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలను నమోదు చేసి సంస్థకు విశేష కీర్తి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఐఐటీ ర్యాంకర్లు, ఎస్ఎస్సీ టాప్ ర్యాంకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సు బ్బారెడ్డి అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ని మర్యాదపూర్వకంగా కలిశా రు. విద్యార్థులు సాధించిన జాతీయ, రాష్ట్ర స్థాయి విజయాలను అభినం దించిన కలెక్టర్, యువత లక్ష్యసాధనకు కృషి, క్రమశిక్షణ, అంకిత భావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రం, దేశానికి మంచి పేరు తీసుకురా వాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, శ్రీ చైతన్య ప్రతినిధుల బృందం జిల్లా పోలీసు అధికారి జగదీష్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. జేఈఈ అడ్వాన్స్, ఎస్ఎస్సీ ఫలితాలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులను ఎస్పీ ప్రత్యేకంగా అభిన ందించారు. ఈ సందర్భ ంగా విద్యార్థులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానిం చారు. ఈ సంద ర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి చదివి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విజయానికి ప్రత్యామ్నాయం కృషి మాత్రమేనని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ..విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల నమ్మకం, అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల క్రమశిక్షణ, శ్రీ చైతన్య విద్యాసంస్థల శాస్త్రీయ బోధనా విధానం ప్రధాన కారణాలని తెలిపారు. భవిష్యత్తులో కూడా జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులను తీర్చిదిద్దేం దుకు సంస్థ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సమీనా ఖాన్, విశ్వనాథ్, నరేష్ వెంకటేష్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ నాయుడు, తిరు మలేశ్వర్ రెడ్డి, ఇర్షాద్ అహ్మద్, నాగభూషణం, డీన్లు, అధ్యాపకులు, తల్లిదం డ్రులు ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఎస్పీ

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య అమలు చేయండి

### - ఏపీయుడబ్ల్యూజే డిమాండ్

అనంతపురం కల్చరల్, జూన్ 06 ప్రభాతవార్త

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొన్నేళ్లుగా అనంతపురం ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో అమలు అవుతున్న ఉచిత విద్యను ఈ సంవత్సరం అమలు చేయండని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు పయ్యావుల ప్రవీణ్, మహమ్మద్ ఆయుఫ్ ఆధ్వర్యంలో ఇవాళ కలెక్టర్ ఓ ఆనంద్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 సీట్లు పేద పిల్లలకు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన అమలులో భాగంగా జర్నలిస్టుల పిల్లలకు అది వర్తింపజేయాలని కోరారు. ప్రతి సంవత్సరం కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖ ఈ విషయంపై మెమో ఇస్తుందని తెలిపారు. మెమోను అధికారుల ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు పంపాలని కోరారు. గత సంవత్సరం కలెక్టర్‌గా ఉన్న వినోద్ కుమార్ విద్యా సంస్థల్లో రాయితీ కల్పిస్తూ మెమో ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే రిపోర్టర్లతో పాటు స్ట్రింగర్లుగా, కాంట్రిబ్యూటర్లుగా పనిచేస్తున్న వారికి ఒకటి, రెండు సంస్థల లో నామమాత్రపు గౌరవ వేతనం వస్తుంది. చాలా సంస్థలలో అది అందరి పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో పిల్లల పాఠశా లల ఫీజులు చెల్లి ంచే స్థితిలో జర్నలిస్టులు లేరు. ఈ జిల్లాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ అమలయ్యేలా పెద్ద మనసుతో విద్యా శాఖను ఆదేశించగలని డిమాండ్ చేశారు వెం టనే అందుకు సంబంధించిన మెమో ఇచ్చి జర్నలిస్టుల పిల్ల లకు ఈ ఏడాది పాఠ శాలలు ప్రారంభం అయ్యేలోగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ ఆయుఫ్, మహ మ్మద్ రసూల్, ఆర్‌వీ ఎస్ ప్రసాద్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు నాగేంద్ర నాథ్ రెడ్డి, యూనియన్ స్టేట్ కౌనిల్ సభ్యులు బాల రంగారెడ్డి, కేపీ కుమార్, చిన్న పత్రికల నాయకులు చౌదప్ప, చలపతి, సనప రామకృష్ణ, లోకరాజు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపియుడబ్ల్యూజే నేతలు

## అధిక ఆదాయాన్ని ఇచ్చేది ఉద్యాన పంటలే - హెచ్.ఓ దివ్య

రాప్తాడు, జూన్ 6 ప్రభాతవార్త

రైతులు పండ్ల తోటలు పెట్టుకోవడం వలన కూలీల ఖర్చు అధిక శ్రమ తగ్గడంతోపాటు ఆదాయం పెరుగుతుందని రాప్తాడు ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారి కె.దివ్య పేర్కొన్నారు. శనివారం రాప్తాడు మండల పరిధిలోని జి.కొత్తపల్లి గాండ్లపర్తి గ్రామాలలో మామిడి డ్రాగన్ ఫ్రూట్ దానిమ్మ అరటి పంటలను రాప్తాడు హెచ్ఈఓ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ..మామిడి దానిమ్మ, అరటి పంటలకు హెక్టరుకు రూ.50,000 సబ్సిడీ, బొప్పాయి పంటకు 2సం.లకు రూ.24,000 ఫారం ఫండ్ 20 : 20 ప్రకారం లోపల 3మీటర్లు లోతు ఏర్పాటు చేసుకుంటే రూ.90,000 సబ్సిడీ కర్బూజా కళింగర పంటలకు డ్రాప్ కవర్ కొరకు హెక్టారుకు రూ.10,000 సబ్సిడీ అల్లనేరేడు ఉసిరి పంటలకు హెక్టరుకు రూ.30,000 సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ రైతులకు మల్చింగ్ సీట్‌కు సబ్సిడీ అలాగే ఉచితంగా డ్రిప్ స్ప్రింకర్లు మరియు వెదురు (బొంగు) మునగ పంటలకు కూడా అధిక శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. తోటలోని ప్యాక్ హౌస్‌కి కూడా సబ్సిడీ ఇస్తున్నామన్నారు. పండ్ల తోటలు పెట్టడం వలన కూలీల ఖర్చు తగ్గుతుంది, ఆదాయం పెరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కె.లక్ష్మినారాయణ, జి.ముత్యాలమ్మ, చంద్రశేఖర్, రంగయ్య, హానుమంత్ రెడ్డి పాల్గొన్నారు.